# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.
- పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ నిధులు ఈనెల 13వ తేదీన రైతుల ఖాతాల్లోకి జమకానున్నాయి.
- నైపుణ్యం పోర్టల్ ద్వారా విద్యార్ధులకు స్కిల్ కోర్సులను అందిస్తున్నామని విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్ తెలిపారు.
- తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని ఈ నెల 13న రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని మంత్రి ఎస్.సవిత తెలియజేశారు.

=====================

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 6వ జిల్లా కలెక్టర్ల సదస్సు ఈరోజు ప్రారంభమైంది. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, వివిధ శాఖల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరిపాలన సహా పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చిస్తున్నారు. ఈ సదస్సు ప్రారంభంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కలెక్టర్ల కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ముఖ్యమైన విషయాలపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికి సమప్రాధాన్యతనిస్తూ ప్రజలకు సుపరిపాలనను అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ కొనుగోలు వ్యయంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించే దిశగా ఇప్పటికే అడుగులు వేశామని, దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లాలని తెలియజేశారు.

(వాయిస్ 31 సెకన్లు)

అదే విధంగా ఉగాది పండుగ సందర్భంగా 2 లక్షల 50 వేల ఇళ్లకు గృహ ప్రవేశాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ.. ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించాలన్నారు.

(వాయిస్ 27 సెకన్లు)

====================

ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈరోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో స్వర్ణ ఆంధ్ర పది సూత్రాలు అంశంపై రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. పేదరిక నిర్మూలనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ.. త్వరలో ఫ్యామిలీ కార్డును అందుబాటులోకి తీసుకురానున్నామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ కార్డు ద్వారా అన్ని రకాల పథకాలను ఆయా కుటుంబాలకు అందించడం జరుగుతుందని తెలిపారు. ముందుగా ఆయా కుటుంబాల స్థితిని బట్టి కుటుంబ అవసరాలను గుర్తించి తగిన విధంగా తోడ్పాటును అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. జీరో పోవర్టీ మిషన్ ద్వారా సమాజంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పియూష్ కుమార్ తెలియజేశారు.

====================

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు ఐటిఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను పరిశ్రమలతో అనుసంధానం చేస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కె.శశిధర్ చెప్పారు. నైపుణ్యం, ఉపాధి కల్పనపై... ఈరోజు ఆయన కలెక్టర్ల సదస్సులో ప్రెజెంటేషన్ ఇస్తూ.. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించే కృషిలో భాగంగా 6వ తరగతి నుండే 11 రంగాలపై దృష్టి సారించామని తెలిపారు. వివిధ స్కిల్ కోర్సులను నిర్వహిస్తున్నామని జిల్లా స్థాయిలో ఉపాధికల్పనాధికారి, గ్రామ స్థాయిలో విలేజ్ ఆఫీసర్ పని చేస్తున్నారని చెప్పారు. నైపుణ్యం పోర్టల్ విజయవంతంగా పని చేస్తోందని, ఈ పోర్టల్ ద్వారా 2 లక్షల 69 వేల మంది నమోదు చేసుకోగా.. వారిలో లక్షా 37 వేల మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

విరామం

====================

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, నివాస పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు ఎల్.పి.జి. సిలిండర్ల సరఫరాలో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈరోజు ఆయన తన కార్యాలయంలో జిల్లా సరఫరా అధికారి, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ఉప సంచాలకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించడంలో గ్యాస్ కొరత రాకూడదని, క్షేత్రస్థాయిలో సరఫరా స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్యాస్ సరఫరాలో ఏవైనా సమస్యలు ఎదురైతే తక్షణమే పరిష్కరించడానికి పౌర సరఫరాల మంత్రిత్వ శాఖ నుండి ఒక నోడల్ అధికారిని నియమించడం జరిగిందని వివరించారు. సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు, విద్యా సంస్థల నిర్వాహకులు ఎప్పటికప్పుడు నోడల్ అధికారితో సమన్వయం చేసుకొని.. గ్యాస్ సరఫరా లోటు లేకుండా చూసుకోవాలని సూచించారు.

====================

రానున్న వేసవి కాలంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే వడగాల్పుల నివారణ కార్యాచరణ ప్రణాళిక-2026 అమలుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. వాటికి అనుగుణంగా ప్రతి అధికారి నిర్లక్ష్యం వహించకుండా పటిష్ట చర్యలు చేపట్టి, ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని ఈరోజు పార్వతీపురం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో స్పష్టం చేశారు.

=====================

మహిళలలో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న HPV వ్యాక్సిన్ ను 14 ఏళ్ళ లోపు ఆడపిల్లలందరూ తప్పనిసరిగా వేయించుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు సెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గ శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో HPV వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ... మూడు నెలల పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 15 వేల 600 మందికి పైగా మహిళలు ఈ వ్యాక్సిన్ కోసం నమోదు చేసుకోవడం అభినందనీయమని, మిగిలిన వారు కూడా తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ ను తీసుకుని క్యాన్సర్ రహిత సమాజం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

=====================

మొట్టమొదటి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని ఈ నెల 13న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె వెల్లడించారు. కవయిత్రి మొల్ల తెలుగుజాతి గర్వించదగ్గ రచయిత్రి అని కొనియాడారు. సంస్కృతంలో వాల్మీకి రచించిన రామాయణాన్ని మొల్లమాంబ తెలుగు భాషలోకి అనువదించారన్నారు. మొల్ల రచించిన ఆ రామాయణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతిగాంచిందన్నారు. మొల్ల స్వస్థలం కడప జిల్లా గోపవరం అని, తెలుగు సాహిత్యానికి ఆమె చేసిన సేవలు అభినందనీయమన్నారు. మొల్లమాంబ జయంతి రాష్ట్ర స్థాయి పండుగగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నామని మంత్రి ఎస్. సవిత తెలిపారు.

=====================

మాజీ కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు కావూరి సాంబశివరావు తుది శ్వాస విడిచారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మరణం పట్ల కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు. కావూరి సాంబశివరావు 5 సార్లు పార్లమెంట్ సభ్యునిగానూ, కేంద్రమంత్రిగా సేవలందించి జీవితాన్ని అంకితం చేసిన ధీశాలి అని శ్రీనివాస వర్మ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై కావూరి నిరంతరం గళం వినిపించిన గొప్ప నాయకుడని, ఆయన మరణం భారతీయ జనతా పార్టీ కుటుంబానికి తీరని లోటని శ్రీనివాస వర్మ అన్నారు.

=====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 78 వేల 205 పాయింట్ల వద్ద స్వల్ప లాభంతో ప్రారంభమై.. చివరికి 1,342 పాయింట్ల నష్టంతో 76 వేల 863 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 394 పాయింట్లు నష్టపోయి 23 వేల 866 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 92 రూపాయల 04 పైసలుగా ఉంది.

=====================
=====================